క్లుప్తంగా

పంట కాలువల్లో పూడిక తీయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పంట కాలువల్లో పూడికను వెంటనే తీయాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు షానవాజ్ డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. పంట కాలువలు గుర్రపుడెక్కతో నిండిపోయాయని, ఈ క్రమంలో వీటి ద్వారా సాగునీరు పారే పరిస్థితి లేదని చెప్పారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య, కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు రమణయ్య, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా పోలీస్ శాఖలో అవినీతి ఎక్కువైందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ఈ మేరకు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి, సీఎం తదితరులకు లేఖలను పంపామని వివరించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని ఐదో డివిజన్లో గల బోడిగాడితోటలో రూ.3.6 కోట్లతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి నారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దీని వల్ల పరిసర ప్రాంతాల్లోని సుమారు ఆరు వేల నివాసాలు, వివిధ సముదాయాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే అవకాశం ఏర్పడిందని చెప్పారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యా సంస్థల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, టీడీపీ నగరాధ్యక్షుడు మామిడాల మధు, ఎస్‌ఈ విజయన్, టౌన్ ఈఈ శ్రీధర్, అధికారులు పరంధామయ్య, సునీల్, విజయ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా



నెల్లూరు(దర్గామిట్ట): వీఓఏలకు పనిభద్రత కల్పించడంతో పాటు రాజకీయ వేధింపులు, తొలగింపులను నిలపాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నాను శనివారం చేపట్టారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం, శాంతకుమారి, రాధా, రాజా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు




నెల్లూరు(దర్గామిట్ట): అన్యాయంగా తొలగించిన ఆశ వర్కర్‌కు న్యాయం జరిగేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆశ వర్కర్స్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, నేతలు మధుసూదనమ్మ, భాగ్యమ్మ, రెహనాబేగం, కామాక్షమ్మ, అల్లాడి గోపాల్, పెంచలనరసయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

పాసులను పునరుద్ధరించాలి

నెల్లూరు రూరల్: జర్నలిస్టులకు రైల్వే పాసులను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున కోరారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు రైల్వే పాసులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీకి అభినందన



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

➡ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, 4, 54వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు కలిశారు.

మేమింతే.. మారమంతే..!

- కలెక్టర్ చెప్పినా అదే తీరు
- మూలనపడిన ఫిజియోథెరపీ మెషీన్లు
- బఫర్ సొల్యూషన్ లేక ఆగిన థైరాయిడ్ పరీక్షలు
- పెద్దాస్పత్రిలో తారస్థాయికి వెతలు



పెద్దాస్పత్రి



ఫిజియోథెరపీ చేయించుకుంటున్న రోగులు

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి బాధ్యతలు చేపట్టాక నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిని గత నెల 20న కలెక్టర్ సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అవసరమైన పరికరాలు రూ.ఐదు లక్షల్లోపైతే హెచ్‌డీఎస్ నిధుల నుంచి ప్రొసీజర్ మేరకు కొనుగోలు చేయడంతో పాటు రోగుల ఇబ్బందులను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఇది జరిగి 15 రోజులు దాటినా, నిరుపేద రోగులకు చిన్న కారణాలతో వైద్యసేవలను అక్కడ అందించలేకపోతున్నారు.

ఇదీ తీరు..

నగరంలోని జీజీహెచ్ జిల్లాకే రెఫరల్ ఆస్పత్రిగా ఉంది. 750 పడకలు, 300 మంది డాక్టర్లు, సుమారు 500 మంది నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. సాధారణ వైద్యం, సర్జరీలతో పాటు మానసిక, గైనకాలజీ, ఆర్థోపెడిక్, చర్మ, ఈఎన్టీ, దంత, నేత్ర, పల్మనాలజీ, పీడియాట్రిక్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. కేన్సర్, యూరాలజీ, న్యూరాలజీ లాంటి సూపర్ స్పెషాల్టీ సేవలను అందిస్తున్నారు. రోజూ 1200 నుంచి 1500 వరకు ఓపీ.. 500 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉన్నారు. అయితే వీరికి వైద్యసేవలందించేందుకు చిన్న మెషీన్లూ అందుబాటులో లేవు. ఓపీలో సరిపడా బీపీ ఆపరేటర్లు లేవు. వేలల్లో ఖర్చయ్యే పరికరాలను సైతం అధికారులు సకాలంలో కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంతో రోగులకు వైద్యం సక్రమంగా అందడం లేదు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

ఇక్కడ నలుగురు మహిళా ఫిజియోథెరపిస్టులు, ముగ్గురు పురుష థెరపిస్టులున్నారు. రోజూ 120 నుంచి 130 మంది రోగులు ఈ సేవల కోసం వస్తుంటారు. అయితే వీరికి ఫిజియోథెరపీ చేసేందుకు ఒక్క యంత్రం అందుబాటులో లేదు. వాక్యూమ్, అల్ట్రా సౌండ్ కాంబినేషన్ థెరపీ.. ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ యంత్రాలు, కాలర్ నెక్ సపోర్టు, ట్రాక్షన్, బూట్ యాంకిల్ సపోర్టు, డంబెల్స్, బ్యాలెన్స్ బోర్డు, థెరా బ్రాండ్స్, రెసిస్టెంట్ బ్యాండ్స్, ఎక్సర్‌సైజ్ బాల్స్ లాంటి ఫిజియోథెరపీ పరికరాలు ఎంతో అవసరం. అయితే ఇవి మూలనపడి నెలలు గడుస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదు.

ఉద్యోగుల సహకారంతో కొంత ఊరట

రోగుల బాధలను చూడలేక నలుగురు కాంట్రాక్ట్ ఫిజియోథెరపీ ఉద్యోగులు తమ జీతంలో కొంత నగదును సమకూర్చి ఇటీవల ఒక యంత్రాన్ని కొనుగోలు చేశారు. అదే విధంగా ఓ ఫిజియోథెరపిస్ట్‌కు చెందిన మెషీన్‌ను ఒక పూట వినియోగిస్తున్నారు. దీంతో కొన్ని రకాల ఫిజియోథెరపీ సేవలు కొంతమేరైనా రోగులకు అందుతున్నాయి.

నిలిచిన థైరాయిడ్ పరీక్షలు

కాలపరిమితి త్వరలో ముగిసే రూ.లక్షల విలువ జేసే రియేజంట్స్ ఉన్నాయి. అతి తక్కువ ఖరీదు చేసే బఫర్ సొల్యూషన్ లేక 25 రోజులుగా థైరాయిడ్ పరీక్షలు చేయడం లేదు. మెషీన్ మరమ్మతులకు గురైందంటూ సోడియం, పొటాషియం లాంటి పరీక్షలను నిలిపేశారు.

సంతకాలు చేయని అధికారి

రూ.లక్షను వెచ్చిస్తే ఫిజియోథెరపీకి అవసరమైన యంత్రాలు సమకూరుతాయి. వీటికి సంబంధించిన ఫైల్‌పై ఆస్పత్రి సూపరింటెండెంట్ సంతకాలు చేయాలి. అయితే ఫైళ్లు తీసుకెళ్తే సూపరింటెండెంట్ రోజుల తరబడి తిప్పుకొంటున్నారని అక్కడి వారే ఆరోపిస్తున్నారు. రోగుల బాధలను ఇప్పటికైనా తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫిజియోథెరపీ యంత్రాలను కొనుగోలు చేస్తున్నాం



ప్రొసీజర్ మేరకు ఫిజియోథెరపీ యంత్రాలను కొనుగోలు చేసేందుకు ఫైల్‌ను సిద్ధం చేశాం. త్వరలోనే ఇవి రానున్నాయి. ఎలాంటి ఫైళ్లు పెండింగ్ లేవు. రక్త పరీక్షలు, మందుల కొనుగోలుకు సంబంధించిన సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తాం.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ పెద్దాస్పత్రి

పేదరికం లేని సమాజానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): స్వర్ణాంధ్ర – 2047లో భాగంగా మెప్మాలోని 11 కీలక ఇండికేటర్ల ద్వారా పేదరికం లేని సమాజం కోసం కృషి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో గల సమావేశ మందిరంలో మెప్మా జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని మెప్మా రాష్ట్ర డైరెక్టర్ తేజ్‌భరత్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజతో కలిసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వీధి వ్యాపారులకు వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం తేజ్‌భరత్ మాట్లాడారు. వడ్డీ వ్యాపారుల బారినపడి మరింత పేదలు కాకూడదని కోరారు. పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ యోజన ద్వారా వీరికి రుణ సౌకర్యాన్ని కల్పించి ఉపాధి చూపాలని సూచించారు. టిడ్కో సముదాయాల వద్ద జీవనోపాధుల కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు.

పోస్టర్లు ఉండకూడదు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు సిటీలో ఒక్క పోస్టర్ కూడా ఉండకూడదని, దీనికి వారం గడువిస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద గోడలకు అంటించిన పోస్టర్లను అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి శుభ్రం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి నగరాన్ని పోస్టర్ రహితంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. నగరంలో పోస్టర్లు ఎక్కడున్నా వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాజకీయ నేతలు ఫ్లెక్సీలు పెట్టుకుంటే 48 గంటల్లో తీసేయాలని స్పష్టం చేశారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర ఎనలేనిది



నెల్లూరు(బృందావనం): పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని సామాజిక సమరసత వేదిక అఖిల భారతీయ సంయోజక్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని భక్తవత్సలనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో సామాజిక సమరసత వేదిక మహిళా విభాగ, నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నేతలు కోడూరు జయప్రద, శ్రీనివాసులు, సుధీర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నెల్లూరు సిటీ: నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకరయ్య మాట్లాడారు. పది విభాగాల్లో పోటీలను నిర్వహించామని చెప్పారు. గ్రూప్ డ్యాన్స్ విభాగంలో నెల్లూరు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. చిత్రలేఖనంలో హేమ శివహాసిని, దృశ్య కళా విభాగంలో రాజంపల్లి మొదటి బహుమతులను దక్కించుకున్నారని తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న రీజినల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని వివరించారు. ఉపాధ్యాయులు జోషీబాబు, దొరసానమ్మ, ఆలిమేలు మంగ, ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



నెల్లూరు సిటీ: ఇస్కాన్ సిటీ రోడ్డులో వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇస్కాన్ సిటీ రోడ్డు, వనంతోపు అరుంధతీయవాడలో అధికారులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల పదో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. విహంగ – 2024 పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపర్చాయి. ప్రిన్సిపల్ గోవిందు, వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం నేడు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని పార్టీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఆదిపరాశక్తీ.. ప్రణామం

నెల్లూరు(బృందావనం): శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలను నిర్వహిస్తున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి జగజ్జననిని దర్శించుకొని తన్మయత్వం చెందుతున్నారు.

➡ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి, కొండ్రెడ్డి భరత్‌కుమార్, ఇందిరా ప్రియదర్శిని, సోమవరపు సూర్యనారాయణ, విజయలక్ష్మి వ్యవహరించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఇనుకొండ సునీల్‌కుమార్, మహాలక్ష్మి, గొల్లపూడి సాయిపవన్ తదితరులు వ్యవహరించారు.

➡ మూలాపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు కాళీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా సుధీర్, సురేష్ వ్యవహరించారు.

➡ నవాబుపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తాతా వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



మహాలక్ష్మి ఆలయంలో..

➡ స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. మూలవర్లు మిఠాయిల అలంకారంలో కటాక్షించారు. ఉభయకర్తలుగా వేముల ప్రసాద్, సుజాత, రామ్మూర్తి, దొరసాని దంపతులు వ్యవహరించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. నవావరణ పూజ, పుష్పాలంకరణ, చండీ హోమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీధర్‌రెడ్డి, మహిత, మురళీ కృష్ణంరాజు, అనిత దంపతులు తదితరులు వ్యవహరించారు.

➡ కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కాకర్ల వెంకట్రావ్, శ్రీలత, శీలం మల్లికార్జున, పద్మావతి, మాలేపాటి వెంకటకృష్ణప్రసాద్, అన్నపూర్ణ, సురేష్, అనూరాధ దంపతులు వ్యవహరించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు మీనాక్షిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వాయుగుండ్ల వేణుగోపాల్, ప్రసన్న, కిరణ్‌కుమార్, లక్ష్మీసుప్రియ దంపతులు వ్యవహరించారు.

➡ విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్బయ్యశెట్టి, పాలూరు సాయిప్రసాద్ ఆచారి, పద్మప్రియ, చెరుకుపల్లి ఈశ్వర్‌రెడ్డి, రత్నమ్మ, ఆర్కాట్ గంగాధర్, అశోక్ కుమార్‌లాల్, కరుణకుమారి దంపతులు వ్యవహరించారు.



సీతారామస్వామి మందిరంలో..



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..

➡ వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో గల వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గజ్జల మధు, ఆదిలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

➡ నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆరణి ఆదిశేషయ్య, వెంకటశేషమ్మ దంపతులు వ్యవహరించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రామకృష్ణ, సుభాషిణి, వంశీధర్, సుమలత, గిరికుమార్, నిర్మల దంపతులు వ్యవహరించారు.

➡ సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆర్కాట్‌కుమార్, హేమలత, రాజేష్, సింధూరి, సునీల్, శ్రావణి దంపతులు వ్యవహరించారు.



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ వేమూరి గోపీ, అర్చకుడు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు రామావతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆవుల అభిలాష్, ప్రవీణ దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మి మందిరంలో..



వైభవలక్ష్మి ఆలయంలో..



వేదగిరిలో..



వెంకటేశ్వరపురంలో..



గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

ప్రకటన

హైదరాబాదు సిటీ కాపురస్థులైన శ్రీ అల్లంపాటి లోకేశ్వర రెడ్డి, తండ్రి విజయవర్ధన్ రెడ్డి గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామ కాపురస్థులైన శ్రీ షేక్ అబ్దుల్ హకీం, తండ్రి షేక్ అబ్దుల్ రజాక్ వద్ద నుండి కొనుగోలు చేయుటకు గాను తీర్మానించుకొనినారు. సదరు షేక్ అబ్దుల్ హకీం గారు దిగువ షెడ్యూలు ఆస్తిని తేది 18-08-2021 న డాక్యుమెంటు నెం. 8985/2021 రు ద్వారా రిజిస్ట్రరు కాబడిన విక్రయ పత్రము ద్వారా డా॥ ఇస్కా అనిల్ కుమార్ రెడ్డి మరియు ప్రసాద్ యస్.అంబడిపూడి గార్ల వద్ద నుండి కొనుగోలు చేసిన రీత్యా వారి స్వాధీనానుభవములో ఉన్నదని తెలుపుచున్నారు.

కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైననూ ఎట్టి హక్కులు కానీ, ధార్మీలు కాని, అడమానములు కానీ మరి ఏ ఇతరములైన అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 10 దినముల లోపల దిగువ అడ్రసుకు వ్రాతమూలకమైన ఆధారములతో తెలియజేయగలరు. పై గడువు లోపల ఎట్టి అభ్యంతరములు రాని ఎడల నా కక్షిదారుడు దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేసెదరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా కక్షి దారున్ని బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్, నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ లిమిట్స్, కొండాయపాళెం గ్రామం, సర్వే నెం. 235-2A-1 రు నందు య 0.41 1/2 సెంట్లు మరియు సర్వే నెం. 235-2A-2 నందు య 0.11 సెంట్లు మొత్తము య. 0.52 1/2 సెంట్లు లేక 317.625 అంకణముల స్థలమునకు హద్దులు :

తూర్పు: నేషనల్ హైవే రోడ్డు, **దక్షిణం:** మార్తాల ఉమామహేశ్వ రెడ్డి గారి భూమి కొంతవరకు, ఇతరుల భూమి కొంతవరకు, ఇస్కా అనిల్ కుమార్ రెడ్డి గారి భూమి కొంతవరకు, **పడమర:** ఇతరుల భూమి కొంతవరకు, ఇస్కా అనిల్ కుమార్ రెడ్డి భూమి కొంతవరకు, **ఉత్తరం:** యస్.బి.టి. దాన్‌బాషా గారి ఇల్లు.

Counter Signed by అల్లంపాటి లోకేశ్వర రెడ్డి | యస్. శ్రీనివాసమూర్తి, B.A. B.L., అడ్వకేట్, 16/1085, ట్రంకురోడ్డు, నెల్లూరు.

బీజేపీ సభ్యత్వ నమోదు



విందుకు హాజరైన కేంద్ర సహాయ మంత్రి తదితరులు

నెల్లూరు(బారకాసు): గాంధీబొమ్మ సమీపంలోని శివాజీ సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శనివారం ప్రారంభించారు. పలువురితో సభ్యత్వాన్ని నమోదు చేయించారు. బీజేపీకి సహాయ సహకారాలను అందించాలని కోరారు. తొలుత ఆయనకు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

➡ కేంద్ర సహాయ మంత్రికి పలువురు వినతిపత్రాలను అందజేశారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, పార్టీ నేతలు మిడతల రమేష్, నరాల సుబ్బారెడ్డి, సురేంద్రరెడ్డి, బైరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త ఇంటికి..

గుప్తా పార్క్ సమీపంలో నివసిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఇంటికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ వెళ్లారు. శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు వాకాటి నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. నగరంలోని తన నివాసానికి వచ్చిన కేంద్ర మంత్రికి వేమిరెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నేతలు సురేష్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను డీఎంహెచ్ఓ పెంచలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. కోటమిట్టకు వచ్చిన మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

➡ కేంద్ర సహాయ మంత్రిని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.